క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



రాచపల్లి అడ్డురోడ్డు జంక్షన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ సుంకర మురళీ మోహన్

ప్రత్తిపాడు రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీ మోహన్ తెలిపారు. ప్రత్తిపాడు పోలీసు స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను సీఐ కిషోర్‌బాబుతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. జాతీయ రహదారిపై చిన్నింపేట జంక్షన్, ప్రత్తిపాడులో సంతోషిమాత గుడి జంక్షన్, రాచపల్లి అడ్డురోడ్డు జంక్షన్, ధర్మవరం కోల్డ్ స్టోరేజ్ కూడలి, జోడు గెడ్ల వాగు తదితర ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

ప్రత్తిపాడు: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం మహిళలకు శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. వీటిని పీసీసీ సభ్యుడు ధరణాల కోట శ్రీను మహిళలకు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి సత్తిబాబు, కందిమళ్ల సామ్యేలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు స్థల పరిశీలన



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: స్థానిక 12 వార్డులో ప్రజలు గత కొంత కాలంగా లోవోల్టేజి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఆ ప్రాంతంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. శనివారం విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో శనివారం చలివేంద్రం ప్రారంభించారు. మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఫౌండేషన్ డైరెక్టర్ మానూరి నాగగౌరీలత ప్రారంభించారు. తొలిరోజు దాతలు కొత్త వెంకటేశ్వరరావు, వెలుగూరి హరేరామ్ సహకారంతో బాటసారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మనం ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



108 వాహనంలో జన్మించిన శిశువుతో సిబ్బంది

గండేపల్లి: మండలంలోని యల్లమిల్లి గ్రామానికి చెందిన ఓ గర్భిణి శనివారం 108 వాహనంలో పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. యల్లమిల్లికి చెందిన గర్భిణి కె.లతకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. గండేపల్లి అంబులెన్స్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బంది ఎన్.ప్రసాద్, గణపతి కుటుంబ సభ్యుల సహకారంతో ఆమెకు పురుడుపోశారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని, పెద్దాపురం ఆస్పత్రికి తరలించినట్టు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

జగ్గంపేట: కానిస్టేబుల్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు జగ్గంపేట సీఐ సూరి అప్పారావు శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మండలంలోని మల్లిసాల, రాజపూడి, జె.కొత్తూరు తదితర గ్రామాల్లో కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలోను స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగ్గంపేట: కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై విద్యాసాగర్ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జగ్గంపేట మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన రేచపూడి కన్నారావు (57) ఈ నెల 20న తన భార్యతో గొడవ పడి గడ్డిమందు తాగాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో కన్నారావును అతని కుమారుడు మణికంఠస్వామి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్ సమస్యకు మోక్షం

- బస్ షెల్టర్లలో ఆక్రమణలు తొలగించిన అధికారులు
- ప్రయాణికులు సేదతీరేలా ఏర్పాట్లు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కోటనందూరు బస్‌షెల్టర్‌లో ఆక్రమణలు తొలగించి ఏర్పాటు చేసిన కుర్చీలు, బల్లలపై సేదతీరుతున్న ప్రయాణికులు

కోటనందూరు: స్థానిక బస్టాండ్ సెంటర్‌ను దశాబ్దాలుగా వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యకు మోక్షం లభించింది. రోజురోజుకూ పెరిగిపోతున్న వాహనాల రద్దీ, ఆక్రమణలతో కోటనందూరులో ట్రాఫిక్ సమస్య పెనుసవాల్‌గా మారింది. సమస్యను పరిష్కరించాలని స్థానికులు పలుమార్లు ఆందోళన చేశారు. కాగా ఉన్నతాధికారుల ఆదేశాలతో రెవెన్యూ, పంచాయతీ, ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ, పోలీసు శాఖల అధికారులు ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు. తొలుత పెద్ద సమస్యగా మారిన తాత్కాలిక బస్‌షెల్టర్లలో ఆక్రమణలు తొలగించి ప్రయాణికులు సేద దీరేందుకు వీలుగా బల్లలు, కుర్చీలు ఏర్పాటు చేశారు. షెల్టర్లలో ఆక్రమణలు తొలగించడంతో బస్టాండ్ సెంటర్లో అస్తవ్యస్తంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిలిపే అవకాశం లేకుండా పోయింది. ఆర్టీసీ బస్సులు సైతం రోడ్డు పక్కకు ఆపుతున్నారు. ఆక్రమణల తొలగింపుతో ట్రాఫిక్ సమస్యతో పాటు నిలువునీడ లేక మండుటెండలో మగ్గిపోయే ప్రయాణికులకు ఇబ్బందులు తొలగిపోయాయి. అధికారుల చర్యల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

50 గ్రామాలకు రాకపోకలు

తుని–నర్సీపట్నం పట్టణాల మధ్య కోటనందూరు పెద్ద బస్టాండు. ఈ బస్టాండు కేంద్రంగా కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో సుమారు 50 గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి 10 నిమిషాలకు ఇటు తునికి, అటు నర్సీపట్నానికి బస్సు ఉంటుంది. మరో పక్క కోటనందూరు నుంచి రౌతులపూడి, శంఖవరం మీదుగా కాకినాడకు ఆర్టీసీబస్సులు తిరుగుతాయి. వేలాది వాహనాలు, ప్రజలతో ఈ బస్టాండు రోజంతా రద్దీగా ఉంటుంది. కాగా వ్యాపార సముదాయం ఈ బస్టాండ్ సెంటర్లోనే ఉండడం, వ్యాపారులు భారీగా రోడ్డును ఆక్రమించేయడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. గతంలో రోడ్ల విస్తరణ పేరుతో శిథిలావస్థకు చేరిన బస్‌షెల్టర్‌ను కూల్చేసి దాతల సహకారంతో తాత్కాలికంగా రోడ్డుకు ఇరువైపులా బస్‌షెల్టర్లు నిర్మించారు. కొంతమంది చిరువ్యాపారులు షెల్టర్లను పూర్తిస్థాయిలో ఆక్రమించేయడంతో ప్రయాణికులు నిరీక్షించేందుకు నిలువునీడ లేకపోగా ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమైంది.

పూర్తిస్థాయిలో తొలగిస్తే..

స్థానిక పోలీసుస్టేషన్ నుంచి కాకరాపల్లి మరిడమ్మ ఆలయం వరకూ తుని–నర్సీపట్నం రోడ్డుకు ఇరువైపులా చోటు చేసుకున్న ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పారదర్శకంగా నిబంధనల మేరకు ఆక్రమణలు తొలగిస్తే ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉండదు.

మూన్నాళ్ల ముచ్చటేనా

ఆక్రమణల తొలగింపు మూన్నాళ్ల ముచ్చటగానే మారుతుందని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో అనేక పర్యాయాలు ప్రజాప్రతినిధులు, అధికారులు మారినప్పుడల్లా ఆక్రమణలు తొలగించడం, తిరిగి వ్యాపారులు ఆక్రమించేయడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో అనేక మంది రోడ్డును ఆక్రమించి పెద్ద భవనాలు సైతం కట్టారు. ఇప్పుడు కూడా అదే మాదిరిగా ఉంటుందని ఆక్రమణదారులు భావిస్తున్నారు. ఆక్రమణల తొలగింపులో అధికారులు గతానికి భిన్నంగా వ్యవహరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెరిగిన ఆర్టీసీ ఆదాయం

బస్‌షెల్టర్లలో ఆక్రమణలు తొలగించి ప్రయాణికులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేయడంతో ఆర్టీసీ ఆదాయం సైతం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం సెంటర్లో ఆటోలు ఆపే పరిస్థితి లేకపోవడం, ప్రయాణికులు కూర్చునే అవకాశం ఉండడంతో ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు.

కష్టాలు తీరాయి



ఆక్రమణల తొలగింపుతో ట్రాఫిక్ సమస్య పరిష్కారంతో పాటు ప్రయాణికుల ఇబ్బందులు తొలగాయి. బస్సు వచ్చే వరకూ హాయిగా కూర్చొని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆక్రమణలపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచి మరోసారి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఆక్రమణల తొలగింపుతో అందరికీ మంచి జరిగింది.

– వాదపర్తి సుబ్బు, కోటనందూరు

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



రత్నగిరిపై స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. పండితులు ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రధానాలయానికి చేర్చారు. వేదపండితులు చిట్టి శివ ఘనపాఠి, సంతోష్, ముష్టి పురుషోత్తం, అర్చకుడు యడవిల్లి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన ఇరు వర్గాలపై స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. రాచపల్లికి చెందిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒమ్మంగికి చెందిన 10 పది మందిపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఇరు గ్రామాల్లో విచారణ చేపట్టారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఎంపీ వంగా గీత
- సుద్దగెడ్డపై వంతెన ప్రారంభం



ప్రత్తిపాడు–లంపకలోవ మార్గంలో సుద్దగెడ్డ వాగుపై నిర్మించిన వంతెన శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ప్రత్తిపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీ వంగా గీత అన్నారు. ప్రత్తిపాడు–లంపకలోవ రహదారిలో సుద్దగెడ్డ వాగుపై మైనింగ్ గ్రాంట్ రూ.2.70 కోట్లతో నిర్మించిన వంతెనను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా సుమారు 25 గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రజా ప్రతినిధులు, ఐఏఎస్ అధికారులు స్వయంగా పరిశీలించినా వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోయిందన్నారు. తమ ప్రభుత్వ హాయంలో సుద్దగెడ్డపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, ప్రస్తుతం వంతెనను ప్రారంభించడం వల్ల ప్రజల చిరకాల వాంఛ తీరిందన్నారు. వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే పర్వత చేసిన కృషిని ఆమె కొనియాడారు. జిల్లాలో ఆసుపత్రుల అభివృద్ధికి రూ. 25 కోట్లు మంజూరైతే ఒక్క ప్రత్తిపాడు నియోజకవర్గానికే రూ.16 కోట్లు కేటాయించారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ మాట్లాడుతూ రౌతులపూడి మండలం ములగపూడిలో నూతన పీహెచ్‌సీ భవనం నిర్మాణానికి రూ.2.70 కోట్లు మంజూరయ్యాయన్నారు. శంఖవరం, రాచపల్లి, జె.అన్నవరం పీహెచ్‌సీలను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. తొలుత ప్రత్తిపాడు ఆర్టీసీ కాంప్లెక్ సమీపంలో రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయం–2 భవనాన్ని, లోవోల్టేజీని అధిగమించేందుకు మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఏలేశ్వరం జెడ్పీటీసీ నీరుకొండ రాజకుమారి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దో చిట్టిబాబు, లంపకలోవ సొసైటీ అధ్యక్షుడు గొంతిన సురేష్, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివ, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

నూతన ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ప్రారంభం



వంతెన ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఎంపీ వంగా గీత

ప్రత్తిపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఐసీడీఎస్ పీడీ కొండా ప్రవీణ, ఇన్‌చార్జి సీడీపీఓ పద్మావతి పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న అధ్యాపక సిబ్బంది

గండేపల్లి: కాకినాడ జేఎన్‌టీయూకేలో ఇటీవల నిర్వహించిన మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో మండలంలోని సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించినట్టు స్కూల్ డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డి శనివారం తెలిపారు. ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించిన మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో ఆదిత్య నుంచి ఫైనాన్స్ విభాగంలో పి. సుధీర్, జె.అపర్ణ, ఎం.శరవణతుషార్, హెచ్‌ఆర్ (మానవ వనరులు) విభాగంలో ఎ. శాంతి, బి.సాయి నరేంద్రనాయుడు, కేఎస్‌ఎన్ కిరీటి, బీవీఎస్ సాయి, బిజినెస్ లా విభాగంలో ఎ.శాంతి, బి.సాయినరేంద్ర నాయుడు, జి.దేవి సృజన, ఎం.శరవణ తుషార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందుకున్నట్టు తెలియజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.విజయ భార్గవి, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఎం.గోవర్ధన్ రెడ్డి తదితరులు అభినందించారు.

కొండపోడు పట్టాలకు 2,580 మంది ఎంపిక

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



జిల్లా ఎసైన్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

శంఖవరం: నియోజకవర్గంలో కొండపోడు భూమి పట్టాలకు 2580 మంది లబ్ధిదారులు ఎంపికైనట్టు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు. కాకినాడలో శనివారం జరిగిన జిల్లా ఎసైన్ మెంట్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని 38 గ్రామాల్లో 2,175 ఎకరాలు కొండపోడు భూమికి 2580 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. శంఖవరం మండలంలోని 7 గ్రామాల్లో 183.41 ఎకరాలను 239 మందిని, రౌతులపూడి మండలంలోని 20 గ్రామాల్లో 1539.76 ఎకరాలకు 1867 మంది, ప్రత్తిపాడు మండలంలోని 11 గ్రామాల్లో 452.26 ఎకరాలకు 474 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్టు వివరించారు. ఎంపిక చేసిన రైతులకు కొండపోడు పట్టాలు మంజూరు చేస్తామని చెప్పారు.

ఘనంగా రంజాన్ వేడుకలు



తునిలో రంజాన్ ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



ఏలేశ్వరం ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కిర్లంపూడిలో చిన్నారుల రంజాన్ సందడి

- ముగిసిన ఉపవాస దీక్షలు
- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

తుని: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండగను తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తుని పట్టణంలోని జామియా మసీదు, జాతీయ రహదారిలోని ఈద్గా వద్ద తుని పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లింలు ఈద్ ఉల్ ఫితర్ నమాజు చేశారు. ఇమామ్ కబీర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఏలేశ్వరం: నియోజకవర్గంలోని ముస్లింలు ఈద్–ఉల్–ఫితర్‌ను శనివారం ఘనంగా జరుపుకున్నారు. నెలరోజుల పాటు చేసిన ఉపవాస దీక్షలు ముగియడంతో స్థానిక నర్సీపట్నం రోడ్డులోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్‌ను పురస్కరించుకుని స్థానిక మార్కెట్ వీధిలోని మసీదును విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ముస్లింలు మసీదు వద్దకు చేరుకుని ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి బంధువులు, స్నేహితులకు స్వీట్లు పంపిణీ చేశారు.

కోటనందూరు: రంజాన్ పండగను ముస్లిం సోదరులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. కొత్తదుస్తులు ధరించి పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ క్రమశిక్షణకు, ఐక్యతకు, మత సామరస్యానికి ప్రతీక అని మత పెద్దలు పేర్కొన్నారు. మసీదుల వద్ద ముస్లింలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముస్లింలు షేక్ మీరాబాయి, ఆదం ఖాన్, పి.నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: స్థానిక జామియా మసీదులో ఇమామ్ మహ్మద్ సంసూల్ హక్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తన నివాసంలో ముస్లింలకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ముస్లింలకు రంజన్ శుభాకాంక్షలు తెలిపారు.

గోకవరం: స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని జుమ్మామసీదు, విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని జామియా మసీదులో ఉదయం నుంచి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు.

సీపీఐ (ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవం



లింగంపర్తిలో లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీశ్రేణులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో సీపీఐ (ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో మార్క్సిస్టు నేత లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ(ఎంఎల్) పార్టీని బలోపేతం చేసేందుకు చారుమజుందార్ వంటి నాయకులు అనేక పోరాటాలు చేశారన్నారు. ఈ పోరాటాలతో పేదలకు ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. విప్లవవీరుడు లెనిన్ జీవితాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మల్లేపల్లి చరణ్‌కుమార్, గంగాధర్, తాతబాబు, పడాల అర్జున్, పప్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక స్టాలిన్ భవనంలో శనివారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. న్యూడెమోక్రసీ పెద్దాపురం డివిజన్ కార్యదర్శి ఎం.చిట్టిబాబు జెండాను ఎగరవేశారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఏసు, భగత్‌సింగ్ గ్రామ కమిటీ సభ్యులు దార్ల వీరభద్రరావు, నామ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో శుక్రవారం సీపీఐ (ఎంఎల్) ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్



జగ్గంపేటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



తొండంగిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగ్గంపేట: మండల పరిధిలోని గ్రామాల్లోశనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. జగ్గంపేట ఎస్సీ కాలనీలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. కాలనీలో ప్రతిఇంటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో చెరుకూరి జయరాజ్, గొల్లపల్లి శ్రీను, ఆకుల శ్రీధర్, నీలపల్లి అప్పారావు, కిలపర్తి వీరబాబు పాల్గొన్నారు.

తొండంగి: మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. తొండంగిలో వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, ఎంపీటీసీ శివకోటి ప్రకాష్, సర్పంచ్ సోమాల ప్రసాద్, ఉపసర్పంచ్ కందా బాబ్జి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఏవీ నగరంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిషత్ నిర్వహించారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

జగ్గంపేట: గ్రామ శివారు పశువుల సంత ప్రాంతంలో పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.1900 స్వాధీనం చేసుకున్నట్టు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

మండలంలోని భావవరం అటవీ ప్రాంతంలో సారా తయారీ కేంద్రాలపై శనివారం జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: చిల్లంగి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.